క్లుప్తంగా

శింగరకొండ దర్శిని



అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, జ్యేష్టమాసం, ఉత్తర నక్షత్రం అష్టమి తిథి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

రేపు వాడరేవు పోలేరమ్మతల్లి తిరునాళ్లు

చీరాల టౌన్: మండలంలోని వాడరేవు గ్రామంలో కొలువుదీరిన పోలేరమ్మ అమ్మవారి 13 వార్షికోత్సవ తిరునాళ్లను శనివారం వైభవంగా నిర్వహిస్తున్నామని దేవస్థాన కమిటీ, గ్రామ పెద్దలు తెలిపారు. తిరునాళ్లను పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు, సాయంత్రం శిడిమాను ఊరేగింపు, కోలాటం, పాట కచ్చేరి వంటి సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్లకు అధిక సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకోవాలని కమిటీ ప్రతినిధులు సూచించారు.

బీసీ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ రాజీనామా


చక్రవరం జ్యోతి

జే.పంగులూరు: రాష్ట్ర భట్రాజుల సంఘం బీసీ వెల్ఫేర్, డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మండల పరిధిలోని బైటమంజులూరు గ్రామానికి చెందిన చక్రవరం జ్యోతి తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ప్రభుత్వ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీకి రాజీనామా లేఖను పంపినట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా చక్రవరం జ్యోతి భర్త వైఎస్సార్ సీపీ బీసీ మండల అధ్యక్షుడు చక్రవరం భాస్కర్ రాజు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ, తనతో పాటు తన వర్గం వారంత వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెంటనే ఉంటామని తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషిచేస్తామన్నారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ పానెం చిన హనిమిరెడ్డి వెంటే నడుస్తామని అన్నారు.

రేపటి నుంచి ధ్యాన, యోగ శిక్షణ తరగతులు

వేటపాలెం: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలో ఈనెల 15 నుంచి ధ్యాన, యోగ ఉచిత శిక్షణ తరగుతులు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు శ్రీరాం గోవర్ధన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈయోగ విజ్ఞానం పొందడం ద్వారా మానసిక ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరిగి శరీరం ఆరోగ్యవంతంగా ఉంటుందన్నారు. ఆధ్యాత్మిక విలువలతో కూడిన సత్సంగం ద్వారా మానసిక విలువలతో కూడిన ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందవచ్చన్నారు. ఈ ఉచిత యోగా కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో రోటరీ సేవలు


రోగులకు పండ్లు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

చినగంజాం (పర్చూరు): స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆసుపత్రిలో రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ అధ్యక్షుడు నాగభైరు శ్రీనివాసరావు ఆసుపత్రికి ఉపయోగపడే గోడ గడియారం, రోగులు, బాలింతలకు పండ్లు, బ్రెడ్ల అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అవసరమైన మౌలిక వసతులు కల్పనకు కృషి చేస్తానని సిబ్బందికి డ్రెస్ కోడ్ కలిగిన బట్టలు ఇస్తానని తెలిపారు. డాక్టర్లు సౌమ్య, ముగ్దుం అలీ మాట్లాడుతూ ఆసుపత్రికి అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని కోరారు. రోటరీ క్లబ్ వారు చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కార్యదర్శి పంబి సదానందరెడ్డి, కోమటి అంజనేయులు, తోకల కృష్ణమోహన్ రోటరీ సిబ్బంది అడ్డగడ శివరామకృష్ణ ఆసుపత్రి సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు కలెక్టర్ అభినందనలు

మార్కాపురం టౌన్: సార్వత్రిక ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించిన మున్సిపల్ కమిషనర్ ఇ.కిరణ్‌కు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ గురువారం అభినందించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి కౌంటింగ్ వరకు తన సిబ్బందితో కలిసి విధులు నిర్వహించినందుకుగాను ప్రశంసా పత్రాన్ని అందించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ గరుడ సుమిత్ సునీల్, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, మార్కాపురం సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బడిబాట పట్టిన విద్యార్థులు

- ఒక రోజు ఆలస్యంగా ప్రారంభమైన పాఠశాలలు
- చాలా చోట్ల పాఠశాలలకు అందని పుస్తకాలు


మార్టూరు స్టాక్ పాయింట్ నుంచి పుస్తకాలు తరలిస్తున్న ఉపాధ్యాయులు


కుంకలమర్రు సీసీ ప్రాథమిక పాఠశాలలో పాఠ్యపుస్తకాలు అందిస్తున్న ఎంఈఓ-1


బల్లికురవలో అడ్మిషన్ల కోసం వెళ్తున్న తల్లిదండ్రులు

కారంచేడు/మార్టూరు: చిన్నారుల పండుగ మొదటి రోజైన పాఠశాలలకు విద్యార్థులకు ఆనందంగా చేరుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు వేసవి సెలవుల అనంతరం బడిబాట పట్టారు. 2024–25 విద్యా సంవత్సరం గురువారం ప్రారంభమైంది. కారంచేడు మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 1362 మంది విద్యార్థులు 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్నారు. గతేడాది విద్యాశాఖ అధికారులు ఇండెంట్ ప్రకారం ప్రభుత్వం విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, రాతపుస్తకాలు, బెల్టులను పంపిణీ చేసింది. ఇంకా యూనీఫారం, బ్యాగ్‌లను సరఫరా చేయాల్సి ఉంది. పాఠ్యపుస్తకాల్లో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు కొన్ని సబ్జెక్టులు రావాల్సి ఉందని ఎంఈఓలు తెలిపారు. అలాగే 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు రావాల్సిన పాఠ్యపుస్తకాల్లో ఏడోతరగతి మాత్రమే పాఠ్య పుస్తకాలు రావాల్సి ఉందన్నారు. ఈఏడాది కొత్త ప్రభుత్వం వచ్చినందున జగనన్న విద్యాకానుకను 'స్టూడెంట్ కిట్' గా పేరుమార్చి ఇవ్వనుంది.

ప్రభుత్వ పాఠశాలల్లో మంచి విద్య..

ప్రభుత్వ పాఠశాలల్లోనే మంచి విద్యాబుద్ధులు నేర్పుతారని ఎంఈఓలు ఎంవీ సత్యన్నారాయణ, మొలబంటి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం పాఠశాలల ప్రారంభోత్సవాలను పురస్కరించుకొని స్వర్ణ, కుంకలమర్రు ఉన్నత పాఠశాలతో పాటు, కుంకలమర్రు మెయిన్, సీసీ పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలు వారు మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎంలు ఎంవీ సుబ్బారావు, పద్మావతి, పావులూరి శ్రీనివాసరావు, బీ బాబూరావు, పీ నాగమణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, కుకింగ్ నిర్వాహకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ 'స్టూడెంట్ కిట్..'

బల్లికురవ: ప్రభుత్వం పాఠశాలల వారీగా విద్యార్థులకు కిట్లు అందజేస్తుందని ఎంఈవో వస్త్రం నాయక్, రమేష్‌బాబు అన్నారు. గురువారం బల్లికురవలోని ఉన్నతపాఠశాల, కేజీబీవీలో జరిగిన పుస్తకాల పంపిణీలో పాల్గొని మాట్లాడారు. మండలంలోని 57 పాఠశాలలు కేజీబీవీలో 1నుంచి 10 తరగతుల్లో విద్యను అభ్యసిస్తున్న 4,500 మందికి పాఠ్య పుస్తకాలు నోట్ పుస్తకాలు బూట్లు, సాక్స్, బెల్టు అందిస్తున్నట్లు తెలిపారు.

యూనిఫాం బ్యాగు త్వరలో అందజేస్తామని బడిఈడు కలిగిన బాలబాలికలందరిని పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. పాఠశాలల వారీగా గురువారం అడ్మిషన్లతో కోలాహలంతో సందడి నెలకొంది. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ కె. సరళకుమార్, బల్లికురవ జిలాపరిత్ ఉన్నత పాఠశాల హెచ్ కె. హనుమంతరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


స్వర్ణ ఉన్నత పాఠశాలలో పాఠ్యపుస్తకాలు అందిస్తున్న ఎంఈఓ-2, కాంప్లెక్స్ చైర్మన్‌లు


బల్లికురవలో విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎంఈవోలు

శోభాయమానంగా హనుమాన్ శోభాయాత్ర


ఆకర్షణీయంగా నిలిచిన రాముడి విగ్రహం


కోలాటం ఆడుతున్న మహిళలు


వేషధారణలలో చిన్నారులు

చీరాల అర్బన్: హనుమాన్ భక్తబృందం ఆధ్వర్యంలో చీరాలలో హనుమాన్ శోభాయాత్రను గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పాల్గొని పూజా కార్యక్రమాలను నిర్వహించారు. దేవాలయంలో ప్రత్యేక పూజల అనంతరం బోస్‌నగర్‌లోని వీరాంజనేయస్వామి దేవస్థానం నుంచి పట్టణంలోని హనుమాన్ నామస్మరణలతో శోభాయాత్ర రామమందిరం మీదగా ముంతావారిసెంటర్, గడియారస్తంభం మీదుగా కూరగాయల మార్కెట్, తెల్లగాంధీబొమ్మ, నల్లగాంధీబొమ్మ సెంటర్ మీదగా తిరిగి వీరాంజనేయస్వామి గుడి వరకు వరకు సాగింది. శోభాయాత్ర సాగే రోడ్లన్ని సిందూర వర్ణ జెండాలతో నిండిపోయింది. ప్రస్తుతం శోభాయాత్రను ఐదోసారి హనుమాన్ భక్త బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. శోభాయాత్రలో రాముని విగ్రహం, ఆంజనేయస్వామి విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలానే చిన్నారులు వేసిన సీతారాములు, ఆంజనేయస్వామి వేషదారణ ఆకట్టుకుంది. శోభాయాత్రలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కేరళ వాయిద్యాలు, డప్పు వాయిద్యాలు, కోలాటం, నాదస్వరం, కర్రసాము కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అలానే జై శ్రీరామ్, జై హనుమాన్ నామస్మరణలతో శోభాయాత్ర శోభయమానంగా సాగింది హనుమాన్ భక్తబృందం ప్రతినిధులు పలువురు ప్రముఖులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఒన్‌టౌన్ సీఐ పి.శేషగిరిరావు ఆధ్వర్యంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

అప్రమత్తతతో ప్రమాదాలు దూరం

- గడువు దాటిన సిలిండర్లతో జాగ్రత్త
- గడువు తేదీపై అవగాహన కల్పించడంలో అధికారుల విఫలం



గడువు తేదీని ముద్రించి ఉన్న గ్యాస్ సిలిండర్

మేదరమెట్ల: మనం నిత్యం వినియోగించే ప్రతి వస్తువుకు గడువు తేదీ అంటూ ఒకటి ఉంటుందని అందులో భాగంగానే గ్యాస్ సిలిండర్‌కు కూడా గడువు తేదీ ఉంటుంది. కాలం చెల్లిన సిలిండర్లను వినియోగించడం వలన ప్రమాదాలు జరిగేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయి. సిలిండర్లపై ఉండే గడువు తేదీలను ప్రజలకు వివరించడంలో గ్రామాల్లోని ప్రజానీకానికి సిలిండర్ గడువు తేదీపై అవగాహన కల్పించడంలో రెవెన్యూ అధికారులు విఫలమయ్యారు. ప్రజలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసిన దాఖలాలు మండలంలో ఎక్కడా కనిపించడంలేదనే చెప్పాలి.

సిలిండర్‌పై తేదీని ఇలా గుర్తించాలి..

ప్రతి ఇంటిలో గ్యాస్ సిలిండర్ వినియోగం తప్పనిసరిగా మారిపోయింది. గ్యాస్ ఏజెన్సీ నుంచి సిలిండర్ తీసుకోగానే దానిపై ఉన్న గడువు తేదీని తప్పక గుర్తించాలి. సిలిండర్ రింగ్‌కు కింది భాగంలో గడువు తేదీ ముద్రించి ఉంటుంది. సంవత్సరంలో ఉండే 12 నెలలను నాలుగు భాగాలుగా విభజించి ఏ,బీ,సీ,డీ గా అక్షరాలను రాస్తారు. అక్షరం ఏ అయితే జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు, బీ అక్షరం అయితే ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించినదిగా, సీ అయితే జులై, అగస్టు, సెప్టెంబర్ నెలకు సంబంధించినదిగా, డీ అక్షరం అయితే అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలలకు సంభించిన సిలిండరుగా గుర్తించాలి. సిలిండర్ డెలివరీ అయిన వెంటనే సిలిండర్‌పై ఉన్న అక్షరాన్ని గుర్తించి సిలిండరు ఏ నెలకు చెందినదో తెలుసుకోవాలి ఒక వేళ గడవు తీరిన సిలిండర్ ఇస్తే తిరగి ఏజెన్సీవారికి ఇచ్చి గడవు ఉన్న సిలిండరును తీసుకోవాలి.

గడువు తీరితే ప్రమాదమే..

సిలిండరును ఎక్కువకాలం వాడకేండా పక్కన పెట్టి వాడటం వలన అది ప్రమాదంగా మారవచ్చు. సిలిండర్‌పై ఉన్న అక్షరాన్ని గుర్తించి అది ఏ నెలకు చెందినదో తెలుసుకొని వాడుకుంటే మంచిదని లేకుంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు. ఇకనైనా రెవిన్యూ అధికారులు సిలిండర్లపై ఉండే గడువు తేదీని గుర్తించడం ఏలాగో ప్రజలకు అవగాహన కల్పించాలని ప్రమాదాలను నివారించాలని మండల ప్రజానీకం కోరుతున్నారు.

అనారోగ్యంతో సొసైటీ మాజీ అధ్యక్షుడు మృతి


దశరథ రామయ్య (ఫైల్)

జే.పంగులూరు: మండల పరిధిలోని చందలూరు గ్రామానికి చెందిన బెల్లకొండ దశరథ రామయ్య (66) బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడు దశరథ రామయ్య గతంలో అద్దంకి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశారు. చందలూరు సొసైటీ అధ్యక్షుడిగా పనిచేశారు. చీరాల మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తికి ప్రియ శిష్యుడు. దశరథ రామయ్య మృతికి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ స్వయంపు హనుమంతురావు, ముళ్లూరి వెంకటేశ్వర్లు దశరథ రామయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గ్రామాల్లో జరుగుతున్న విషయాలను గమనించాలి


మహిళా సంరక్షణ కార్యదర్శులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ అజయ్‌కుమార్, ఎస్ఐ మహేష్

మద్దిపాడు: గ్రామాల్లో జరుగుతున్న అన్ని విషయాలను గమనిస్తూ పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వాలని ఒంగోలు రూరల్ సీఐ టీఎక్స్ అజయ్‌కుమార్ మండలంలోని మహిళా సంరక్షణ కార్యదర్శులను ఆదేశించారు. వారితో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు జరిగిన నేపథ్యంలో గ్రామాల్లో వర్గపోరు జరిగే అవకాశాలు ఉన్నాయని, అక్కడక్కడా అటువంటి ఘటనలు నమోదవుతున్నాయని తెలిపారు. అందువలన మహిళా సంరక్షణ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండి గ్రామాల్లో జరుగుతున్న విషయాలు తెలుసుకుని తక్షణమే ఎస్ఐకి సమాచారం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో ఉద్రిక్తతలు సృష్టించే వారిని పోలీసుశాఖ ఎప్పుడో గుర్తించిందని, వారు కాకుండా మరెవరైనా అటువంటి ఉద్రిక్తతలు కలిగించే వారిపై దృష్టి ఉంచి అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా వెంటనే సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలపాల్సి ఉందన్నారు. గ్రామాల్లో ప్రశాంతతకు భగం వాటిల్లే చర్యలు ఎవరు తీసుకున్నా శిక్షార్హులవుతారని, అటువంటి వారిని గుర్తించి సమాచారం ఎస్ఐకి అందించాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ వి.మహేష్, అన్ని గ్రామాల మహిళా సంరక్షణ కార్యదర్శులు పాల్గొన్నారు.

నీట్‌పై విచారణ జరపాలి

ఒంగోలు: నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన అవకతవకలపై విచారణ జరపాలని రెవెల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈదుపల్లి నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక అప్సర సర్కిల్ ప్రాంగణంలో ఆర్ఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. 2024 విద్యా సంవత్సరంలో మెడికల్ విద్య అభ్యసించేందుకు జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలు ఈనెల 4న విడుదలయ్యాయన్నారు. అయితే 67 మంది విద్యార్థులకు 720/720 మార్కులు రావడం, వీరంతా మొదటి ర్యాంక్ పొండడం, వీరిలో ఏడుగురు ఒకే సెంటర్లోని విద్యార్థులు కావడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. జూన్ 14న విడుదల చేస్తామన్న ఫలితాలను పదిరోజుల ముందే అంటే దేశవ్యాప్తంగా ఎన్నికల ఫలితాల హడావిడిలో ఉన్న సమయంలో విడుదలచేయడం కూడా అనుమానాలకు కారణంగా నిలిచిందన్నారు. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు.

జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ సునీత



చీరాల: తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో గురువారం జరిగిన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీల సమావేశంలో భాగంగా ఎమ్మెల్సీ, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పోతుల సునీత వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ నాయకులు పోతుల సురేష్, ప్రకాష్ ఉన్నారు.

ఘనంగా రేవు పండుగ

చీరాల టౌన్: ప్రతి ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు రెండున్నర నెలలపాటు కేంద్ర ప్రభుత్వాదేశాలతో మత్స్య ఉత్పత్తి కోసం సముద్రంలో చేపల వేట నిషేదం అమలు చేస్తున్నారు. సముద్రంలో వేట నిషేధం ఆజ్ఞలు శుక్రవారంతో తొలగనుండటంతో వాడరేవులోని మత్స్యకారులు గురువారం తమ సంప్రదాయం ప్రకారం తీరం ఒడ్డున 'రేవు పండుగ'ను తీరం ఒడ్డున వైభవంగా జరుపుకున్నారు. మత్స్యకార సాంప్రదాయం ప్రకారం మత్స్యకార పెద్దలు గంగమ్మ తల్లికి ప్రత్యేకపూజలు, ప్రార్థనలు జరిపించుకున్నారు. వేట నిషేధం అనంతరం రేవు పండుగ చేయడం మత్స్యకారులకు ఆనవాయితీ. ఈ రేవు పండుగలో గంగగమ్మ తల్లికి మత్స్యకారులు ప్రత్యేక పూజలు చేశారు. వేటకు వినియోగించే బోట్లు, వలలు, వేట సామగ్రికి పూజలు, ప్రార్థనలు చేశారు. ఈ ఏడాది వేటలో పుష్కలంగా మత్స్య సంపద లభించి తమకు మేలు చేయాలని కోరుతూ పూజలు చేసి అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. ఆనవాయితీ ప్రకారం శుక్రవారం వేకువజామున తొలి బోటు వేటకు వెళ్లి వచ్చిన అనంతరం శనివారం నుంచి గంగపుత్రులు సముద్రంలో వేటకువెళ్తారని మత్స్యకార పెద్దలు తెలిపారు. తొలిబోటు ఆనందంగా వేట చేసుకుని తిరిగి వాడరేవు తీరానికి వచ్చిన అనంతరం మిగిలిన మత్స్యకారులు వేటకు వెళ్లే ఆచారం ఏళ్లతరబడి నుంచి అమలు చేస్తుండటం మత్స్యకారులకు ఆనవాయితీగా వస్తుందని మత్స్యకార పెద్దలు తెలిపారు.

విత్తన కొనుగోలుకు బిల్లులు తప్పనిసరి


అద్దంకి: దుకాణంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏడీఏ శ్రీనివాసరావు


మార్టూరులో విత్తన దుకాణాలను తనిఖీ చేస్తున్న ఏడీఏ

అద్దంకి: రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలని మార్టూరు సహాయ వ్యవసహాయ సంచాలకుడు కేవీ శ్రీనివాసరావు అన్నారు. ఆయన స్థానిక వ్యవసాయాధికారితో కలసి గురువారం పట్టణంలోని విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తన కొనుగోలు సమయంలో బిల్లులు తీసుకోవడంతోపాటు, అందులో విత్తన రకం, కంపెనీపేరు ఏ ల్యాబ్ నంబరు, లాట్‌నంబర్, ఉన్నాయో లేదో పరిశీలించుకోవాన్నారు. అప్పుడే ఏదైనా విత్తన రకం గురించి తేడాలు వచ్చిన మయంలో న్యాయం చేయడానికి వ్యవసాయ శాఖకు వీలు కలుగుతుందని చెప్పారు. నాసిరకం విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయా దుకాణాలను గుర్తించి లైసెన్స్ రద్దు చేయడంతోపాటు కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట స్థానిక మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకట కృష్ణ ఉన్నారు.

విత్తన విక్రయాలు పారదర్శకంగా ఉండాలి.

మార్టూరు: వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున రైతులకు విత్తనాలను విక్రయించే డీలర్లు నిబంధనలు పాటించాలని.. లేకుంటే చర్యలు తప్పవని మార్టూరు డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎస్ మోహన్‌రావు హెచ్చరించారు. గురువారం సాయంత్రం ఆయన మార్టూరు ఏవో వీ కిరణ్ కుమార్‌తో కలిసి విత్తన దుకాణాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్థానిక హైబ్రిడ్ విత్తనాల దుకాణంలో విత్తనాల కొనుగోలుకు సంబంధించిన అనుమతులు లేనందున ఆ షాపులో నెలలో ఉంచిన రూ.15 లక్షల విలువైన మిరప విత్తనాల విక్రయాలను నిలుపు చేస్తున్నట్లు ఏడీఏ విలేకరులకు తెలిపారు. డీలర్లు విత్తనాలను ఎమ్మార్పీ ధరల కంటే అదనంగా విక్రయించరాదని.. ప్రతి రైతుకు విత్తనాల కొనుగోలుకు సంబంధించిన బిల్లులు ఇవ్వాలని రైతులు కూడా తాము కొనుగోలు చేసిన బిల్లులు రసీదులను పంట కోతకు వచ్చేవరకు భద్రపరుచుకోవాలని తెలిపారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

చీరాల టౌన్: బ్యాంకు లింకేజీ రుణాలు తీసుకున్న పొదుపు గ్రూపులు రుణాల చెల్లింపులు సకాలంలో చెల్లించేలా వీఓఏలు చర్యలు తీసుకోవాలని ఏపీఎం సుబ్బారావు సూచించారు. గురువారం బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవన్‌లో మండలంలోని వీఓఏలకు సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం సుబ్బారావు మాట్లాడుతూ మండలంలో ఉన్న పొదుపు గ్రూపుల వద్దకు వీఓఏలు నెలకు ఒకసారి సమావేశాన్ని నిర్వహించి గ్రూపుల ప్రగతిని తెలుసుకోవాలన్నారు. పొదుపు గ్రూపులు తీసుకున్న రుణాలు, ఏర్పాటు చేసుకున్న స్వయం సహాయక సంస్థలు, వ్యాపారాలను వీఓఏలు పరిశీలించి పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ సంఘాల పుస్తకాలను విధిగా రాయడంతో పాటు సీఐఎఫ్, స్త్రీనిధి, సబ్ ప్లాన్ రుణాల అన్నీ 100 శాతం సక్రమంగా చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రుణం వాయిదాలు పూర్తి అయిన గ్రూపులకు అదనపు మొత్తంతో రుణం అందించాలన్నారు. వీఓఏలు పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

విద్యార్థికి నగదు బహుమతి అందజేత


విద్యార్థిని సత్కరిస్తున్న రోటరీ, పూర్వ విద్యార్థులు

చీరాల అర్బన్: 2023–24 విద్యాసంవత్సరంలో పదోతరగతిలో 550 మార్కులతో స్కూల్ ఫస్ట్ సాధించిన సాధించిన మానేపల్లి జానకి రామాచారికి గురువారం సత్కారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థికి రూ.11,116 లు నగదు బహుమతి, శాలువాతో సత్కరించారు. చీరాల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఎస్ఆర్‌పీఎం హైస్కూల్ 1992 పదోతరగతి పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో గత తొమ్మిదేళ్లుగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎస్ఆర్‌పీఎం హైస్కూల్‌లో చదువుకున్న వారు ఉన్నత స్థానాలలో నిలిచారన్నారు. కార్యక్రమంలో మామిడాల శ్రీనివాసరావు, డివి సురేష్, పోలుదాసు రామకృష్ణ, బి.హేమంత్‌కుమార్, డాక్టర్ గురునాథం, షేక్ బషీర్, యక్కల చంద్రశేఖర్, గోలి మురళీ, జీవై ప్రసాద్, తిరుపతిరావు, పూర్ణచంద్రరావు, గురుప్రసాద్, రోటరీ, వాకింగ్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.